నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 13 ఫిబ్రవరి 2025 | YADADRI BHUVANAGIRI

### ఓయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాలు షురూ

రామగిరి, ఫిబ్రవరి 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్ఆర్‌సీడీఈ)లో 2025 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31లోగా దరఖాస్తులను www.oucde.netలో సమర్పించాలని సూచించారు. వివరాలకు ఎన్జీ కళాశాల స్టడీ సెంటర్, సెల్ : 939867 3736ను సంప్రదించాలని కోరారు.

### ఎంజీయూలో వివిధ విభాగాలకు అధికారుల నియమకం

రామగిరి, ఫిబ్రవరి 12: ఎంజీయూలోని వివిధ విభాగాలకు అధికారులను నియమిస్తూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆదేశాలమేరకు బుధవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి ఉత్తర్వులు జారీచేశారు. అడిషనల్ కంట్రోలర్‌గా డాక్టర్ ఎం.రామచందర్‌గౌడ్, కోచింగ్ సెంటర్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్.శ్రవణ్‌కుమార్‌ను నియమించారు. వీరు సంవత్సరం పాటు ఆయాహోదాల్లో కొనసాగనున్నారు.

# కాంగ్రెస్‌కు నై.. బీఆర్ఎస్‌కు జై




తుంగతుర్తి నియోజకవర్గంలో సర్వే రిపోర్ట్ చక్కర్లు

## కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే పాలనపై తీవ్ర వ్యతిరేకత

### మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు 93 ఓట్లు
### ఎమ్మెల్యే సామేల్‌కు 16 మాత్రమే..
### తేటతెల్లం చేస్తున్న సోషల్ మీడియా సర్వే ఫలితాలు


**అలివికాని హామీలతో అధికారంలోకి వచ్చి అన్నింటికీ మొండిచెయ్యి చూపుతున్న కాంగ్రెస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. రెండ్రోజులుగా తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర సోషల్ మీడియా గ్రూపులో ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పని తీరుపై ఓ సర్వే జరుగుతున్నది. ఒక్క రోజులో 109 మంది సర్వేలో పాల్గొనగా.. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు 93 ఓట్లతో 85.32 శాతం మద్దతు లభించగా, ఎమ్మెల్యే సామేల్‌కు కేవలం 16 ఓట్లతో 14.68 శాతం మాత్రమే మద్దతు దక్కింది. అధికార పార్టీ, ఆ పార్టీ ఎమ్మెల్యేపై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో ఈ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.**

– సూర్యాపేట, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ)




తుంగతుర్తి నియోజకవర్గంలోని ఓ సోషల్ మీడియా గ్రూపులో కనిపించిన సర్వే

ఏడాది క్రితం అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ మోసపూరితమైనవని తేలిపోవడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ఒకటీ రెండు స్కీమ్‌లను మాత్రమే అరకొరగా ప్రారంభించి చేతులు దులుపుకోవడంపై మండిపడుతున్నారు. అంతేగాక బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు బంద్ కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రధానంగా తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలో వ్యతిరేకత మరీ ఎక్కువగా కనిపిస్తున్నది. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యవహారశైలిని ప్రజలే గాక సొంత పార్టీ నాయకులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధికారిక సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పని తీరుపై నిర్వహించిన సర్వేలో కేసీఆర్‌కు భారీగా మద్దతు లభించగా, రేవంత్‌కు నామమాత్రపు స్పందన రావడం కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపింది. ఈ క్రమంలో నియోజకవర్గాల స్థాయిలో సోషల్ మీడియా వేదికగా సర్వేలు జరుగుతున్న సర్వేలోనూ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకత ఫలితాలే వస్తున్నాయి.



85.32%



14.68%

**ఇంత వ్యతిరేకత ఎందుకంటే..!**

గత ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టిన అభివృద్ధి నిలిచిపోవడం, సంక్షేమ పథకాలు అమలు కాకపోవడం, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేకపోవడంతోపాటు స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్‌పైనా సొంత పార్టీలో పెద్దఎత్తున వ్యతిరేకత కనిపిస్తున్నది. ప్రతి గుంట భూమికీ సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తుంగతుర్తి నియోజకవర్గం సస్యశ్యామలం కాగా, నేడు కాంగ్రెస్ పాలనలో సాగు నీటి కోసం రైతులు ఎదురు చూడాల్సి వస్తున్నది. కండ్ల ముందే పంటలు ఎండిపోతుండడంతో రైతులు తట్టుకోలేకపోతున్నారు. దాంతో రైతాంగం అధికార కాంగ్రెస్‌పై దుమ్మెత్తి పోస్తున్నది. కేసీఆర్ ఇచ్చినవన్నీ పెంచి ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ పెంచకపోగా.. ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్, ఆయన కుటుంబంపై సొంత పార్టీ నాయకులే విమర్శలు చేస్తూ వ్యతిరేకంగా భారీ సభ పెట్టడం వంటివి వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నాయి.

#### గాదరికి భారీ మద్దతు

ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న సర్వేలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు అనూహ్య రీతిలో మద్దతు లభిస్తుండడం విశేషం. కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఇతర నియోజకవర్గాల్లోనూ ఇలాంటి సర్వేలు జరుగుతుండగా.. పలుచోట్ల బీఆర్ఎస్‌కు 60 నుంచి 70 శాతం, అధికార కాంగ్రెస్‌కు 30 నుంచి 40 శాతం మద్దతు లభిస్తున్నట్లు లెక్కలు చెప్తున్నాయి. తుంగతుర్తిలో మాత్రం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు 93 శాతం మద్దతు లభించగా, ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్‌కు 16శాతం మాత్రమే దక్కడం గమనార్హం.

## ఎమ్మెల్యే సామేల్‌పై టీపీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు

ఎమ్మెల్యే, ఆయన కొడుకులపై ఒక విచారణ కమిటీ వేయాలని వినతి

సూర్యాపేట, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుపై సొంత పార్టీలో వ్యక్తమవుతున్న వ్యతిరేకత గాంధీభవన్ వరకూ చేరింది. సామేలు ఒంటెత్తు పోకడలు, కక్షపూరిత ధోరణితో తాము తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ ఆ పార్టీ నేతలు బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే విధానాలతో కాంగ్రెస్ పార్టీ పతనావస్థకు చేరుకుంటున్నదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సామేలు, ఆయన కొడుకుల వ్యవహార శైలిపై విచారణ కమిటీ వేసి, నివేదిక ప్రకారంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బతికి బట్టకట్టాలంటే సమన్వయ కమిటీ వేయాలని, అలాకాకుండా ఎమ్మెల్యేకే అభ్యర్థుల ఎంపిక బాధ్యతను అప్పగిస్తే పార్టీ అడ్రస్ లేకుండా పోతుంది అంటూ అడ్డగూడూరుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు హెచ్చరించినట్లు గూడెపు నాగరాజు పేరిట సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతున్నది. 'ఎమ్మెల్యే తీరుతో మొదటి నుంచి ఉన్న కార్యకర్తలు ద్వితీయశ్రేణి పౌరులుగా మారారు. ఈ విధానం ఇలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోరమైన ఓటమి చూడాల్సి వస్తుంది. సామేల్‌తోపాటు ఆయన కుమారుల ఆగడాలకు అంతే లేకుండా పోతున్నది. అడ్డగూడూరుకు చెందిన నివాసం కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బీసీ నేత మారిశెట్టి మల్లేశ్‌పై ఎమ్మెల్యే మనుషులు దాడి చేశారు. దాడికి పాల్పడిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి' అంటూ పీసీసీ అధ్యక్షుడినికి కోరినట్లు సోషల్ మీడియాలో పోస్ట్‌లో పేర్కొన్నారు.

# వేతన వెతలు

**ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నుంచి ఎనిమిది నెలలుగా జీతాల్లేవ్**



- నిధులు విడుదల చేయని సర్కార్.. చేతులెత్తేసిన ఏజెన్సీలు
- హెల్త్, ఐబీ, రూరల్ వాటర్, గురుకుల, తదితర శాఖల్లో ఉద్యోగుల అవస్థలు
- వచ్చేదే అరకొర వేతనాలు.. అవి కూడా అందకపోవడంతో తిండికి తిప్పలు
- ఉమ్మడి జిల్లాలో సుమారు మూడు వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

నల్లగొండ, ఫిబ్రవరి 12 : ఒకటి కాదు..రెండు కాదు ఏకంగా ఆరు నుంచి ఎనిమిది నెలలుగా వేతనాలు లేక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆకలితో అలమటిస్తున్నారు. కూటి కోసం అప్పులు చేసి వచ్చే వేతనం కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. సర్కార్ నిదులు విడుదల చేయడం లేదని ఏజెన్సీలు చేతులెత్తేస్తే అధికారులు మాత్రం ముఖం చాటేస్తున్నారు. దాంతో వారు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితుల్లో అయోమయంలో పడ్డారు. డ్యూటీ విషయంలో నిక్కచ్చిగా ఉండే అధికారులు వేతనాల విషయంలో ఎందుకు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నప్పటికీ సర్కార్ ఇచ్చినా ఇవ్వకపోయినా ఏజెన్సీలే ఇవ్వాలని మాట చెబుతున్నారు. హెల్త్, ఐబీ, రూరల్ వాటర్, గురుకుల, విద్యా, వెటర్నరీ ఇలా చెప్పుకుంటూ పోతే ఏ శాఖలో కదిలించినా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బాధలు వర్ణనాతీతం. అట్లని నిగ్గదీస్తే ఉన్న ఉద్యోగం పోద్దేమనే భయంతో వెనకడుగు వేస్తున్న పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో సుమారు మూడు వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవనం అగమ్యగోచరంగా మారింది.

#### చిరుద్యోగులపై చిన్నచూపు

ప్రభుత్వ శాఖల్లో రెగ్యులర్ ఉద్యోగులను నియమించని సర్కారు తాత్కాలిక అవసరాలను తీర్చుకోవడానికి గతంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించేది. కాలానుగుణంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులర్ కోసం పోరు చేస్తున్న నేపథ్యంలో ఆ వ్యవస్థను పక్కన పెట్టి రాష్ట్ర వ్యాప్తంగా శాఖల వారీగా ప్రైవేటు ఏజెన్సీలకు కాంట్రాక్ట్ అప్పచెప్పి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ద్వారా తాత్కాలిక అవసరాలను తీర్చుకుంటున్నది. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో ల్యాబ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీస్ సబార్డినేటర్లు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో నీటి సరఫరా సిబ్బంది, గురుకులాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది.. ఇలా ప్రతి శాఖలో ఏదో ఒక హోదాలో పని చేస్తూ కాలం వెల్లదీస్తున్న ఈ చిరుద్యోగులకు ఏజెన్సీలు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదు. ఒక్కో శాఖలో ఆరు నుంచి ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి పలు సంఘాలు తీసుకెళ్లినప్పుడు మాత్రమే స్పందించిన ఏజెన్సీలు ఒకటి రెండు నెలలు ఇచ్చి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది.

#### భారంగా మారిన జీవితాలు

ఆయా శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు రూ.10 వేల నుంచి రూ. 19,500 వరకు నెల వేతనంగా అందుతుంది. దానితో కడుపునింపుకొనే వారికి ఏడెనిమిది నెలలుగా ఏజెన్సీలు వేతనాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తున్నది. నెల తిరిగే సరికే పిల్లల ఫీజుల, ఇతర ఇంటి ఖర్చుల నేపథ్యంలో జీవితం భారంగా మారి ఇబ్బంది పడుతున్నారు. చేసిన అప్పులు సకాలంలో చెల్లించకపోవడంతో మరోసారి అప్పు పుట్టని పరిస్థితి నెలకొందని పలువురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని శాఖల్లో ఏజెన్సీలు మానవతా దృక్పథంతో వేతనాలు ఇస్తున్నా ఎనిమిది నెలలుగా ఇవ్వడంతో వారికి కూడా భారంగా మారిందనే చెప్పొచ్చు. కొన్ని శాఖలో ఏజెన్సీలకు కొంత డబ్బు ఇస్తేనే వేతనాలు ఇస్తున్నట్లు తెలుస్తున్నది.

#### విధుల విషయంలో సర్కారు కఠినం.. అయినా..

ఇచ్చేది అరకొర వేతనం, అందులోనే పలు రకాల కోతలతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. పలు శాఖల్లో పర్యవేక్షణ కారణంగా కింది స్థాయిలో అనేక సమస్యలు వస్తున్నాయి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విధుల విషయంలో కఠినంగా ఉండే సర్కార్ ఎందుకు వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా గురుకుల విద్యా సంస్థల్లో అనేక ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగుల విధులపై సీరియస్‌నెస్ చేసిన సర్కార్ వారి వేతనాలు మాత్రం సమయానికి ఇవ్వకపోవడం గమనార్హం. ఇక వారికి వేతనాలు ఇచ్చే ఏజెన్సీలు పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కొందరి ఉద్యోగుల వేతనం ప్రభుత్వమే నేరుగా ప్రిన్సిపాళ్ల ఖాతాల్లో వేస్తుండగా పలు కారణాలతో కోతలు పెట్టి డబ్బులు ఇస్తున్నారట. మరి కొన్ని శాఖల్లో కొందరి ఉద్యోగులకు పీఎఫ్ కూడా చెల్లించడం లేదని, ఫలితంగా వారి ఖాతాలు క్లియర్ కావడం లేదని విమర్శలు వస్తున్నాయి.

## ఇండియన్ నేవీలో మెరిసిన గిరిజన తేజం

- యూపీఎస్సీలో తొలి ప్రయత్నంలోనే అసిస్టెంట్ ఇంజినీర్‌గా రమేశ్‌నాయక్ ఎంపిక



రమేశ్ నాయక్

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 12 : మండలంలోని డాకు తండాకు చెందిన కరంటోతు తులసీరామ్, సాలీ దంపతుల కుమారుడు కరంటోతు రమేశ్ నాయక్ ఇటీవల యూపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో భారత రక్షణ రంగం నేవీలో అసిస్టెంట్ ఇంజినీర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న తులసీరామ్ దంపతులకు ముగ్గురు పిల్లలు కాగా రమేశ్‌నాయక్ చిన్నవాడు. పుట్టుకతోనే పోలియో ఉండడంతో ఆత్మస్థైర్యం కోల్పోకుండా కష్టపడి చదవి కొలువు సాధించాడు. విద్యార్థులకు ట్యూషన్లు చెబుతూ, ఓలా బైక్ నడుపుతూ వచ్చిన డబ్బుతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యానని రమేశ్ తెలిపాడు. మొదటి ప్రయత్నంలోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించిన రమేశ్‌ను తల్లిదండ్రులు, తండా ప్రజలు అభినందిస్తున్నారు. రమేశ్ నాయక్ 5 నుంచి 10వ తరగతి వరకు హయత్ నగర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో చదివాడు. మాహబూబ్‌నగర్‌లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పూర్తి చేసి, ఇబ్రహీంపట్నంలో బీటెక్, ఎంటెక్ చేశాడు. 2023లో యూపీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించి, 2024 డిసెంబర్ 3న ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యాడు. ఈ నెల 24వ తేదీన ముంబైలో ఉద్యోగంలో చేరనున్నట్లు రమేశ్ పేర్కొన్నాడు.

## బీర్ల ఒంటెద్దు పోకడకు కళ్లెం వేయాలి

- టీపీసీసీ అధ్యక్షుడికి మోటకొండూర్ కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం ఇస్తున్న మోటకొండూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు

మోటకొండూర్, ఫిబ్రవరి 12 : ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఒంటెద్దు పోకడకు కళ్లెం వేయాలని, ఏకపక్ష నిర్ణయాలతో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఆయన నివాసంలో బుధవారం మోటకొండూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు అనంతుల నవీన్‌రెడ్డి, యూత్ కాంగ్రె స్ మండలాధ్యక్షుడు బుగ్గ శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. కార్యకర్తల అభిప్రాయాన్ని కాదని ఏకపక్షంగా నూతన మండల అధ్యక్షుడిని నియమించడమే కాకుండా, కనీసం రెండు సంవత్సరాలు కాకముందే గ్రామ, మండల కమిటీలను రద్దు చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీ కోసం పని చేసి జెండా మోసిన కార్యకర్తలుగా తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నామని, పార్టీ అధికారంలోకి వచ్చి నా తాము నియోజకవర్గంలో ఎన్నో అవమానాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కార్యకర్తలను పట్టించుకోకుండా కేవలం తన బంధు వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.



పోలీసుల అదుపులో మున్నూరుకాపు నాయకులు

## మున్నూరుకాపు నాయకుల ముందస్తు అరెస్ట్

నేరేడుచర్ల, ఫిబ్రవరి 12: నేరేడుచర్లకు చెందిన పలువురు మున్నూరు కాపు సంఘం నాయకులను స్థానిక పోలీసులు బుధవారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఇటీవల తెలంగాణలో జరిగిన కులగణనలో మున్నూరుకాపుల జనాభాను తక్కువ చేసి చూపడాన్ని నిరసిస్తూ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు.

దీంతో జిల్లా మున్నూరుకాపు సంఘం నాయకులు ధూళిపాళ ధనుంజయనాయుడు, బాల వెంకటేశ్వర్లు, కాలం నాగయ్య, అంబటి నాగేశ్వరరావు, వెన్నం సురేశ్‌ను ముందస్తు అరెస్ట్ చేశారు.

# నీళ్లు లేక పశువులకు మేతగా..

- ఎండిపోతున్న పొట్ట దశకు వచ్చిన వరి పొలాలు
- ఆందోళనలో రైతులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 12 : రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతున్నది. దీంతో బోర్లు, వ్యవసాయబావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ప్రభుత్వం సాగునీటిపై దృష్టి పెట్టకపోవడంతో ఈ యాసంగిలో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే పలు చోట్ల సాగు నీళ్లు లేక వరి పంటలు ఎండిపోయాయి. ఆత్మకూర్.ఎం మండలంలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయి చుక్క నీరు కనిపించడం లేదు. మండలంలో వానకాలంలో 19,735 ఎకరాల్లో వరి సాగుచేయగా యాసంగిలో 15వేల ఎకరాలకే పరిమితమయ్యారు. అయినా అవి కూడా నీళ్లు లేక పండుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని సర్వేపల్లి, తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోగా రైతులు పశువులు, గొర్రెలకు మేతగా వదిలేస్తున్న సంఘటనలు కనిపిస్తున్నాయి.



ఆత్మకూరు(ఎం) మండలం సర్వేపల్లిలో నీళ్లు లేక ఎండిపోయిన వరి పైరును మేస్తున్న గొర్రెలు

#### మూడెకరాల పంట ఎండిపోయింది



మాకున్న 3ఎకరాల్లో వరి సాగు చేశాం. కాలం కలిసిరాక బోరు, వ్యవసాయ బావిలో పూర్తిగా నీళ్లు అడుగంటిపోయినయి. చేతికివచ్చిన పంట ఎండిపోయింది. పొట్ట దశకు వచ్చిన మూడెకరాల పంట నీళ్లు లేకపోవడంతో పూర్తిగా ఆరిపోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ సమయానికి రైతు బంధు, ఎరువులను అందజేసి రైతులను ఆదుకున్నడు. నేడు మూడెకరాల సాగు కోసం లక్షా20 వేల రూపాయలు పెట్టుబడి పెడితే చేతికి రాకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అనేక ఇబ్బందులు పడుతున్నాం. రైతు భరోసా ఇవ్వకుండా రుణమాఫీ చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పాలిట శాపంగా మారిండు.

-సోలిపురం బుచ్చిరెడ్డి, రైతు ఆత్మకూరు(ఎం)

#### నీళ్లు లేక అర ఎకరం కూడా పండలే..



కేసీఆర్ హయాంలో బావులు, బోర్లలో నీళ్లు పుష్కలంగా ఉండేవి. నాడు మాకున్న ఐదు ఎకరాల్లో వరి సాగు చేస్తే ఏ ఇబ్బంది లేకుండా పంటలు పండేవి. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత సాగు నీటి కష్టాలు వచ్చినయి. ఇప్పుడు యాసంగిలో అర ఎకరం సాగు చేసినా బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పంట ఎండిపోయింది. చేసేదేం లేక గొర్రెల మేతకు వదిలేశాం. ఎండిపోయిన పంటలను పరిశీలించి ప్రభుత్వం నష్ట పరిహారం అందివ్వాలి.

-సుదగాని వెంకన్న, సర్వేపల్లి



కోదాడ సరిహద్దులో కోళ్ల లోడుతో వచ్చిన వాహనాన్ని పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

## సరిహద్దులో కోళ్ల రవాణాపై నిషేధం

కోదాడ రూరల్, ఫిబ్రవరి 12: బర్డ్‌ఫ్లూ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వేలాది కోళ్లు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో బర్డ్‌ఫ్లూ తెలంగాణలోకి వ్యాప్తి చెందకుండా ఇతర ప్రాంతాల నుంచి కోళ్లు, కోళ్ల దాణా రవాణాను నిషేధించాలని, ఇందు కోసం ముమ్మర తనిఖీలు నిర్వహించాలని జిల్లా పశువైద్యాధికారి డి.శ్రీనివాసరావు అన్నారు. నల్లబండగూడెం శివారులోని రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద 65 నంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని బుధవారం వెటర్నరీ బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోదాడ ప్రాంతీయ వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పి.పెంటయ్య, కోదాడ మండల పశు వైద్యాధికారి బి.మధునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

## మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో రైల్వే జీఎం తనిఖీ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 12: మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌ను బుధవారం దక్షణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ తనిఖీ చేశారు. బీబీనగర్, గుంటూరు రైల్వే మార్గంలో రెండో లైన్ ఏర్పాటు చేస్తుండగా భద్రతా తనిఖీల్లో భాగం గా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ప్లాట్ ఫాం, బుకింగ్ కౌంటర్, పార్సిల్ కోసం వచ్చిన వాహనాలను ఆయన పరిశీలించారు. రైల్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డివిజన్ రైల్వే మేనేజర్ రామకృష్ణ, సీనియర్ డీసీఎం ప్రదీప్, డీఓఎం దినేశ్‌కుమార్, స్టేషన్ సూపరింటెండెంట్ తారకేశ్వర్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ ఉన్నారు.